
ప్రజాశక్తి


సోమవారం 30 సెప్టెంబర్ 2024



కలెక్టర్‌ను కలిసిన ఇపిడిసిఎల్ ఎస్ఇ

ప్రజాశక్తి - పార్వతీపురం

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఇపిడిసిఎల్) పర్యవేక్షక ఇంజనీర్‌గా కె చలపతిరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయన జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌ను ఆదివారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. జిల్లాలో విద్యుత్ వ్యవస్థను గురించి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలని సూచించారు.



కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఇ

డిడి సరెండర్ వెనుక రాజకీయ హైడ్రామా

- అధికారపార్టీ నాయకుడి భార్యకు లైన్ క్లియర్
- ప్రభుత్వ పెద్దల ఒత్తిడి మేరకే కలెక్టర్ ఉత్తర్వులు?
- సూపరింటెండెంట్ డెప్యుటేషన్ వెనుక కూడా...

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాంగద కృష్ణ సరెండర్ వెనుక పెద్ద రాజకీయ హైడ్రామా నడిచినట్లు సర్వత్రా చర్చ జరుగుతోంది. బలమైన కారణాలేవీ లేకుండా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ డిడిని సరెండర్ చేయడం చర్చనీయాంశమవుతోంది. సాధారణంగా ఏ అధికారినైనా సరెండర్ చేయాలంటే బలమైన కారణం చూపించాల్సి వుంది. సరెండర్ చేయడమనేది ఆ ఉద్యోగి లేదా అధికారి సర్వీస్‌లో అత్యంత హీనమైన శిక్షగా పరిగణించవచ్చు. ఏ అధికారి కూడా సరెండర్ చేయించుకునే స్థాయికి దిగజారే పరిస్థితి ఉండదు. అయితే పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో పనిచేస్తున్న డిడి రుక్మాంగద కృష్ణను సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల్లో బలమైన కారణాలేవీ కనిపించలేదు. డిడిగా ఆయన విధులు సక్రమంగా నిర్వహించలేదని, హెచ్చరించినా పనితీరు మార్చుకోలేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కానీ జిల్లా కలెక్టర్ ఇలాంటి ఉత్తర్వులు జారీ చేయడం వెనుక బలమైన రాజకీయ కారణాలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది. జిల్లాకు చెందిన ఒక గిరిజన అధికార పార్టీ నాయకుడ్ని ప్రసన్నం చేసుకునేందుకు, ఆయన భార్యను డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించేందుకు ఇప్పుడున్న డిడిని బలిపశువు చేయాలని నిర్ణయించారనే వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో ఆ నాయకుడు జిల్లాలో ఎస్టీ నియోజకవర్గంలో టిడిపి టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. ఆయనకు సీటు రాలేదు. ఆ నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి గెలుపు కోసం కృషి చేశారు. ఆయన కూడా గతంలో ప్రభుత్వ ఉద్యోగం చేసి విఆర్ఎస్ తీసుకున్నారు. ఇప్పుడు ఆ గిరిజన నాయకుడి భార్య పక్క జిల్లాలో సహాయ గిరిజన సంక్షేమ అధికారిగా పని చేస్తున్నారు. ఆమెను పార్వతీపురం ఐటిడిఎకి బదిలీపై తీసుకొచ్చి గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ బాధ్యతలు అప్పగించి ఆ గిరిజన నాయకుడ్ని సంతృప్తి పరిచేందుకే ప్రయత్నాల్లో భాగంగానే ఈ హైడ్రామాకి తెరలేపారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అధికారపార్టీ నాయకుడ్ని ప్రసన్నం చేసుకునేందుకే డిడిని సరెండర్ చేశారనే చర్చ జోరుగా సాగుతోంది.

సూపరింటెండెంట్ డెప్యుటేషన్ వెనుక కూడా

పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు కార్యాలయంలో రింగ్ మాస్టర్‌గా వ్యవహరిస్తోన్న సూపరింటెండెంట్‌ను పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు కార్యాలయానికి డెప్యుటేషన్‌పై బదిలీ చేయడం వెనుక కూడా బలమైన కారణం వున్నట్లు తెలుస్తోంది. గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర స్థాయి కార్యాలయంలో చక్రం తిప్పుతున్న ఓ అధికారి గతంలో పాడేరు ఐటిడిఎలో డిడిగా పని చేశారు. ఆయన పనిచేసిన కాలంలో జరిగిన అక్రమాలపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో స్థానిక సూపరింటెండెంట్ డెప్యుటేషన్‌పై బదిలీ కావడం చర్చనీయాంశమవుతోంది.

ఉచిత ఇసుక ఏదీ?

ప్రజాశక్తి - సీతంపేట

కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చి 100 రోజులు పూర్తి అయినా నేటికీ ఉచిత ఇసుక సరఫరా చేయడంలేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.తిరుపతిరావు విమర్శించారు. ఇసుక కొరతతో భవన యజమానులు, నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇసుక కొరతను ఆసరా చేసుకొని పాలకొండ నియోజకవర్గంలో రాత్రి సమయంలో అక్రమ రవాణా జరుగుతుందన్నారు. అయినా అధికారులకు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. హౌసింగు అధికారులు స్టాక్ పాయింట్స్ చూపించినా అక్కడ ఇసుక లేదన్నారు. గతంలో ఇసుక సామాన్యులకు అందుబాటులో లేదని గగ్గోలు పెట్టిన నాయకులు నేడు అధికారంలోకి వచ్చి తర్వాత మౌనంగా ఉంటున్నారన్నారు. ఇప్పటికైనా ఉచిత ఇసుక ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు.

గొప్ప దార్శనికుడు సీతారాం ఏచూరి

సంస్మరణ సభలో వక్తలు



సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు సుబ్బారావమ్మ

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్, టౌన్

దేశంలోనే అణగారిన వర్గాల అభ్యున్నతికి పార్లమెంట్లో గొంతెత్తి నినదించడమే కాకుండా, తన వాదనా పటిమతో ప్రత్యర్థి నాయకుల మెప్పును పొందగలిగే అనితర సాధ్యుడు, గొప్ప దార్శనికుడు సీతారాం ఏచూరి అని వక్తలు కొనియాడారు. సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి నివాళిగా జిల్లా కమిటీ ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అధ్యక్షతన సంస్మరణ సభ జరిగింది. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు నివాళ్లు అర్పించారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుబ్బారావమ్మ మాట్లాడుతూ మరికొద్ది రోజుల్లో పార్టీ మహాసభలు నిర్వహించుకునే తరుణంలో ఆయన మరణం ఎనలేని లోటన్నారు. ప్రపంచంలో అన్ని పార్టీలు గుర్తించిన మార్క్సిస్టు మేధావి ఏచూరి అని ఆమె అన్నారు. దేశ ప్రధాని సైతం వామపక్ష కాంతిరేఖగా ఆయన్ను అభివర్ణించడం, మతోన్మాద శక్తులను ఎదుర్కొనేందుకు ఏచూరి మార్గమే శరణ్యమని రాహుల్ గాంధీ కొనియాడడం, దేశం ఒక సిద్ధాంతకర్తను కోల్పోయినట్లు చంద్రబాబు ప్రకటించడం గమనిస్తే ఆయన వ్యక్తిగా అన్ని పార్టీల నాయకులు సైతం అభిమానించే వ్యక్తిత్వం కలిగిన వారిని అన్నారు. ఇందిరాగాంధీని సైతం ఎదిరించగల ధీరత్వం ఆయనదని అలాంటి నాయకుడ్ని కోల్పోవడం దురదృష్టకరమైనప్పటికీ ఆయన మార్గంలో నడిచి ఆశయాలను సాధించడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు.

ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన గీతాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కొల్లి గంగు నాయుడు, వి.ఇందిర, ఐద్వా నాయకులు రెడ్డి శ్రీదేవి, బొత్స లక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమణారావు, మన్మధరావు, కోశాధికారి జి.వెంకటరమణ, పలువురు ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని, పార్లమెంటరీ విధానాన్ని అవపోసన పట్టిన గొప్ప మేధావి



సీతారాం ఏచూరి దేశ పరిస్థితులతో పాటు భారత రాజ్యాంగాన్ని, పార్లమెంటరీ విధానాన్ని అవపోసనపట్టిన గొప్ప మేధావి అని సిపిఎం సీనియర్ నాయకులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి కొనియాడారు. మూలాలు కాకినాడలో ఉన్నాయని, దక్షిణ భారతంలో పుట్టి, ఉత్తర భారత దేశంలో కూడా ఆయన రాజకీయ ప్రభావాన్ని చూపించారని అన్నారు. తనకు ప్రత్యక్ష పరిచయాలు ఆయనతో లేకపోయినా, పార్టీ కేంద్రనాయకుడిగా ఆయన రాజకీయ శైలిని అనుసరిస్తూ ఉన్నామని అన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో పార్టీని నడిపించడంలో ఎనలేని స్థితప్రజ్ఞత ప్రదర్శించారని, ఆయన రాజకీయ దురంధరుడని మారడానికి ఆయన కుటుంబం యావత్తూ స్వాతంత్య్రోద్యమంలో పాల్గొన్న నేపథ్యమేనని అన్నారు. చిన్ననాటి నుంచే వామపక్ష భావాలను అలవర్చుకున్నారన్నారు. ప్రత్యర్థులను సైతం అభిమానించే వ్యక్తిత్వం ఆయన సొంతమన్నారు.



సీతారాం ఏచూరికి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

నిరాడంబర నేత ఏచూరి



వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ విద్యార్థి దశలో తమకు సీతారాం ఏచూరి ఆదర్శ నాయకుడని, ఆయన ప్రసంగాలు విని ఉత్తేజితులమై ఆయన్ను ఆరాధించడం ప్రారంభించామని అన్నారు. ఢిల్లీలోని జెఎన్‌యులో తమ మిత్రులను కలవడానికి వెళ్లినప్పుడల్లా ఆ ప్రాంగణంలో నిరాడంబరంగా ఉండే ఏచూరిని చూస్తూ ఉండేవారమని అంటూ ఆయనతో తన అనుబంధాన్ని తెలిపారు.

ఏచూరి వ్యూహాలు మరువలేనివి



టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకట నాయుడు మాట్లాడుతూ 1984 టిడిపి సంక్షోభంలో ఉన్నప్పటి నుంచి సీతారాం ఏచూరిని తాము గమనిస్తూ ఉన్నామని, రాష్ట్రంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఎన్టీయార్‌కు అండగా నిలబడి ఆయన సాగించిన పోరాటంతో పాటు, కేంద్ర ప్రభుత్వం తలలు వంచేందుకు ఆయన చూపించిన చొరవ, వేసిన వ్యూహాలు టిడిపి పార్టీ ఎప్పుడు గుర్తు ఉంచుకుంటుందని అన్నారు.

వామపక్ష ఐక్యత కాంక్షించే నాయకులు



సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు మాట్లాడుతూ వామపక్ష ఐక్యతను బలంగా కాంక్షించే నాయకుడు సీతారాం ఏచూరి అని, దేశ కమ్యూనిస్టు చరిత్రలో ఉన్నత శిఖరాలకు చేరుకున్న నాయకుడని, ఆయన లేని లోటు వామపక్ష ప్రజాతంత్ర పార్టీలకు తీర్చలేనిదని అన్నారు.

లౌకికవాద బలోపేతాన్ని ఆకాంక్షించారు



సిపిఐ ఎంఎల్ నాయకులు ఎం.భాస్కరరావు మాట్లాడుతూ మతోన్మాద శక్తుల నుంచి దేశాన్ని రక్షించడానికి లౌకికవాదం బలపడడమే ఏకైక మార్గమని కాంక్షించిన వ్యక్తి ఏచూరి అని అన్నారు. ప్రస్తుతం శ్రీలంక వంటి దేశాల్లో కమ్యూనిస్టు పార్టీ గెలవడం చూస్తుంటే భవిష్యత్తు కమ్యూనిస్టు పార్టీలదేనని ప్రజలు కాంక్షిస్తున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో ఏచూరి మరణం వామపక్ష పార్టీలకు తీవ్రమైన లోటని అన్నారు.

ఏచూరి ఆశయాలు కొనసాగించాలి



సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు మాట్లాడుతూ ఏచూరి ఆశయాలను కచ్చితంగా అన్ని పార్టీలు కొనసాగించడమే లక్ష్యం కావాలన్నారు.

సందడే సందడి

- అబ్బురపర్చిన సాంస్కృతిక ప్రదర్శనలు
- ఆలోచింపజేసిన మ్యాజిక్ షో
- అలరించిన నాటికలు
- రెండో రోజూ పోటెత్తిన జనం
- స్టూడెంట్ ఫెస్ట్‌కు పెరిగిన ఆదరణ
- నేటి రాత్రితో ముగింపు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థి

ఓ వైపు విద్యార్థుల పరస్పర కరచాలనం... యువతీ, యువకుల విన్యాసాలు.. విజ్ఞానం విరజిల్లే సైన్స్ ఎగ్జిబిషన్. చిన్నారుల చిరునవ్వుల కేలి.. అబ్బుర పర్చిన నృత్య ప్రదర్శనలు.. సాంఘిక దురాచార నిర్మూలనపై రక్తి కట్టించే నాటికలు.. ఆలోచింపజేసిన మ్యాజిక్‌షో.. ఇలా ఎన్నో విశేషాలతో స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియం సందడిగా మారింది. యువత ఉత్సాహం, ఉల్లాసం, కేరింతలకు ఈ ప్రాంగణం కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్‌కు రెండోరోజు ఆదివారం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల తాకిడి మరింత పెరిగింది.



ప్రదర్శనలను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, విజయనగరంటౌన్

నగరంలోని గురజాడ కళాభారతి ఆడిటోరియంలో డ్రగ్స్ నిర్మూలనే ధ్యేయంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ ఆదివారం రెండోరోజుకు చేరుకుంది. ఫెస్ట్‌లో భాగంగా ఏర్పాటుచేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆలోచింపజేసింది. మరోవైపు ఆటపాటలతో ఫెస్ట్ సాగింది. కొందరు విద్యార్థులు సినీ పాటలకు బ్రేకు డ్యాన్సులు వేయగా, మరికొందరు సంప్రదాయ నృత్య విన్యాసాలతో సభికులను కట్టిపడేశారు. ఇంకొందరు జానపదాలకు నృత్యరూపకం కట్టారు. కొందరు తల్లిదండ్రులు కూడాఉత్సాహంగా పాటలు ఆలపించారు. 'జాగ్రత్త నా చిట్టితల్లి... జింక వేషాలు వేసే సింహాలు ఉంటాయి' అంటూ ఓ విద్యార్థిని తల్లి పాడిన గేయం.. నేటి సమాజంలో మహిళలపై దాడులను, అత్యాచారాలను ఎలా ఎదుర్కోవాలో నేర్పింది. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపైనా విద్యార్థులు ఆటపాటలు, నాటికల రూపాల్లో తెలియజేశారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. డ్యాన్స్ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఈపు విజయ్ కుమార్, చంద్రిక, ఆర్.సూర్యపాత్రో వ్యవహరించారు.

ఫెస్ట్‌ని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కార్యదర్శి ఎ.అజశర్మ, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ ప్రభాత్, రాష్ట్ర నాయకులు వి.రాజగోపాల్, సాహితీ స్రవంతి రాష్ట్ర కన్వీనర్ చీకటి దివాకర్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, ఈశ్వరరావు, శ్రీనివాస్, పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు తదితరులు సందర్శించారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

రాయితీపై పుస్తకాలు

ఫెస్ట్‌లో ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శనలో మహానుబావుల జీవిత చరిత్ర మొదలుకుని, భారతదేశ చరిత్ర వరకు, వివిధ ప్రముఖులు రచించిన పుస్తకాల నుంచి విద్యార్థులకు అవసరమయ్యే పోటీపరీక్షల పుస్తకాల వరకు రాయితీపై అందుబాటులో ఉంచారు.

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం

ఫెస్ట్‌లో భాగంగా ఏర్పాటుచేసిన వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు కొత్తకొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. గణిత, భౌతిక శాస్త్రాలలో లోతైన అవగాహన పెంచేలా ప్రాజెక్టులను ఆవిష్కరించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రదర్శనలను వీక్షించారు.



నేటితో ముగియనున్న ఫెస్ట్

స్టూడెంట్ ఫెస్ట్ సోమవారం రాత్రితో ముగియనుంది. ఇప్పటి వరకు ఒక లెక్క.., సోమవారం మరో లెక్క అన్నట్టుగా బహుముఖ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఫెస్ట్ నిర్వాహకులు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్, జిల్లా కార్యదర్శి వెంకటేష్ తెలిపారు. జనరంజకమైన కార్యక్రమాలతోపాటు ఈ ఫెస్ట్‌లో ఉత్సాహంగా పాల్గొన్న వారికి ముగింపు సభలో భాగంగా జ్ఞాపికలు అందిస్తామని చెప్పారు.



అదుర్స్.. చంద్రయ్య మ్యాజిక్ షో

ఫెస్ట్‌లో భాగంగా జనవిజ్ఞాన వేదిక మెజీషియన్ ఎన్.చంద్రయ్య ప్రదర్శించిన మ్యాజిక్‌షో విద్యార్థులతోపాటు సభికులందర్నీ విశేషంగా ఆకట్టుకుంది. ప్రకృతికి విరుద్ధంగా ఏవీ జరగవని, అలా జరిగినట్టు ఎవరు చూపించినా అది అభూత కల్పనలేనని విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. కొన్ని రసాయనాల కలయిక ద్వారా నీరు, ఇసుక నుంచి అగ్గి తీయడం, మండుతున్న అగ్గిని నోటితో ఆర్పడం, స్వచ్ఛమైన నీటిని రంగు నీళ్లుగా మార్చడం, మరుగుతున్న నూనెలోని బజ్జీలను చేతితో తీసినా కాలకపోవడం వంటి ఎన్నో మ్యాజిక్‌షోలు చేయడంతో పాటు అవన్నీ ఏయే రసాయనాల కలయిక ద్వారా సాధ్యమయ్యాయనే విషయాలను వివరించారు. వీటినే కొందరు మహిమలుగా చిత్రీకరించి జనాన్ని మోసం చేస్తున్నారని, ఇటువంటి మూఢనమ్మకాలు పెంచేవారి పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు చంద్రయ్య సూచించారు.



మంటలను ఆర్పడంపై మ్యాజిక్‌షో ద్వారా అవగాహన కల్పిస్తున్న జెవివి మెజీషియన్ చంద్రయ్య



డ్రగ్స్ వల్ల అనర్థాలపై వీధి నాటిక ద్వారా అవగాహన కల్పిస్తున్న ఎస్ఎఫ్ఐ బృందం



డ్రగ్స్ వల్ల మహిళలపై జరుగుతున్న అకృత్యాలను నృత్య ప్రదర్శన ద్వారా వివరిస్తున్న గరివిడి విద్యార్థినులు

మున్సిపల్ టీచర్ల పోరాటాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మున్సిపల్ టీచర్ల దశల వారీ పోరాటాన్ని జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు మాట్లాడుతూ మున్సిపల్ టీచర్లకు, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, పోస్టులన్నింటినీ అప్ గ్రేడ్ చేసి ప్రమోషన్లు బదిలీలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అర్బన్ ఎంఇఒ పోస్టులను మంజూరు చేయాలని, మున్సిపల్ హై స్కూళ్లకు నాన్ టీచింగ్ స్టాఫ్‌ను కేటాయించాలని డిమాండ్ చేస్తూ దశలవారీ పోరాటాన్ని సాగిస్తున్నామని తెలిపారు. అక్టోబర్ 2న సత్యాగ్రహ దీక్ష, 17న డిఇఒ కార్యాలయం వద్ద, 24న డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేయడానికి కార్యాచరణ ప్రకటించడమైందని, అన్ని దశల్లో జరిగే కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ.భాస్కరరావు, సహాధ్యక్షులు వి.జ్యోతి, జిల్లా కోశాధికారి కె.మురళి, ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

జెఎసి జనరల్ సెక్రటరీగా ప్రసాద్ ఎన్నికపై హర్షం

ఉద్యోగం, ఉపాధ్యాయ సంఘాల జెఎసి రాష్ట్ర జనరల్ సెక్రటరీగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జెఎస్ఎస్ ప్రసాద్ ఎన్నికవడంపై యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు తోట రమేష్ హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి ప్రసాద్ నాయకత్వం దోహదపడుతుందని రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని పలు గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలను ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ బృందం సభ్యులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలు లేకపోవడంతో విద్యార్థుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని, అనేక చోట్ల విద్యార్థుల మరణాల సంభవిస్తున్నాయని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ఆరోగ్య కార్యకర్తలను తక్షణమే నియమించాలని కోరారు. బాలికల ఆశ్రమ పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్లు లేకపోవడం విద్యార్థులకు రక్షణ కరువుతుందన్నారు. అలాగే ఆశ్రమ పాఠశాలల్లో 300 నుంచి 500 మంది విద్యార్థులకు వంట చేసేందుకు తగినంత మంది వర్కర్లు లేకపోవడంతో సమయానికి భోజనం అందడం లేదని, దీనివల్ల విద్యార్థుల విద్యకు ఆటంకం కలుగుతుందన్నారు. పలు పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో పాఠాలు ఏ విధంగా పూర్తవుతాయని వీరు ప్రశ్నించారు. దీనివల్ల విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారని అన్నారు. పలు ఆశ్రమ పాఠశాలల వసతి గృహ భవనాలు లేకపోవడం వల్ల విద్యార్థులు తరగతి గదిలోనే నిద్రపోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా అధ్యక్షులు అమర్నాథ్, మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు చక్రి, గుమ్మలక్ష్మీపురం మండలం ప్రధాన కార్యదర్శి భగవాన్, నాయకులు భారతి, రామకష్ణ, అశోక్, చిన్ని ఉన్నారు.


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో ఇటీవల మొండెంఖల్‌కు చెందిన బెహరా శ్రీనివాస్ మనవడు, అదే గ్రామానికి చెందిన గంజాయి శేఖర్, తుమ్మికమానుగూడకు చెందిన ఆరిక శంకర్రావు, గుంజరాడకు చెందిన బిడ్డిక మాధవరావు, అమ్మ సరస్వతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించి, కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో మండల కన్వీనర్ కె.వి. కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ రంజిత్ కుమార్, టిడిపి నాయకులు హెచ్.సుబ్బలక్ష్మి, రంజిత్‌కుమార్ నాయకో, లోవరాజు, సుఖేష్, యువరాజ్, మంజువాణి, వెంకట్రావు, తిరుపతి, మధు, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డును అందుకుంటున్న కృష్ణమూర్తి

కానిస్టేబుల్ కృష్ణమూర్తికి అంబేద్కర్ ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి పార్వతీపురంటౌన్

పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వృద్ధమిత్ర కె.కృష్ణమూర్తి ఆయన సేవలకు గానూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎక్సెలెన్స్ అవార్డును అందుకున్నారు. విశాఖపట్నంలోని జిల్లా గ్రంథాలయంలో జి.ఎస్‌హెచ్‌ఎం అకాడమీ డైరెక్టర్, చైర్మన్ డాక్టర్ ఎంవి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. హైకోర్టు న్యాయవాది బంగారి జార్జి, ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ ప్రొఫెసర్ సూరప్పడు, విశాఖ ఆర్‌జెడి ప్రెసిడెంట్ నమ్మి అప్పలరాజు, హ్యూమన్ రైట్స్ స్టేట్ చైర్మన్ కొండవిల్లి లక్ష్మి, ప్రముఖులు పాల్గొన్నారు.


శ్రీనివాసరావును సన్మానిస్తున్న సాహితీవేత్తలు

సమాజం పట్ల సామాజిక స్పృహ ఉండాలి

ప్రజాశక్తి - సాలూరు రూరల్

సమాజం పట్ల ప్రతిఒక్కరికీ సామాజిక పరిస్థితులపై అవగాహన ఉండాలని ప్రముఖ సామాజిక కార్యకర్త, శ్రీ సాయి వెంకటవిద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కోట్ల శ్రీనివాసరావు తెలిపారు. తెలంగాణకు చెందిన ఉమెన్ సేఫ్టింగ్, తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ లీగల్ ఎయిడ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆన్లైన్‌లో నిర్వహించిన మహిళల భద్రత అనే అంశంపై వచన కవితల పోటీల్లో శ్రీనివాసరావు రచించిన 'ఎందుకు ఊరుకోవాలి' అనే కవితఉత్తమ కవితగా ఎంపికైంది. దీంతో శ్రీశ్రీ కళా వేదిక జాతీయ అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్, జాతీయ కార్యదర్శి కొల్లి రమాదేవి, ఒడిస్సా అధ్యక్షులు బొమ్మాడి నరసింగరావు అనకాపల్లిలోని శ్రీ గౌరి గ్రంథాలయంలో డాక్టర్ శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు.

బాలికలు ఆత్మ స్థైర్యం పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి- భామిని

బాలికలు ఆత్మ స్థైర్యం పెంపొందించుకోవాలని హోలీ క్రాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ అన్నారు. హోలీ క్రాస్ సంస్థ నడుపుతున్న గ్లోక్లబ్‌లోని 130 మంది బాలికలతో సింగిడి కళ్యాణ మండపంలో ఆత్మవిశ్వాసం అనే అంశంపై ఆదివారం ప్రాంతీయ సమ్మిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల ఆత్మస్థైర్యం నింపే కార్యక్రమాలతో పాటు వారిలో ఉన్న సానుకూల లక్షణాలు తెలియజేసే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెంటర్స్ పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు, నగదు అందజేత

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని బెలగాం చర్చి వీధిలో గల పునీత కార్మిక జోజప్ప దేవాలయంలో ఆదివారం ఫాదర్ థామస్ రెడ్డి ఆధ్వర్యంలో విన్సెంట్ డి పాల్ యువత, స్త్రీలు, పురుషుల విభాగాల నుంచి పార్వతీపురం విచారణ పరిధిలో ఉన్న 40 మంది పేదలకు నిత్యావసర వస్తువులు, కొంత ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫాదర్ థామస్ రెడ్డి మాట్లాడుతూ పేదల కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందుకు రావాలని సభ్యులకు కోరారు.

3 నుండి మల్లెమ్మతల్లి దసరా ఉత్సవాలు

సీతంపేట : మల్లెమ్మ తల్లి దసరా ఉత్సవాలు అక్టోబర్ 3 నుండి 12వరకు దారిమల్లిలో అంగరంగ వైభవంగా నిర్వహించబడుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా డాన్స్ పోటీలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల వారు అక్టోబర్ 3లోగా రూ. 500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

గిరిజన గ్రామాల్లో గ్రామదర్శిని

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలో చిన్నకంబ, సీధి సామరెల్లి లో ఆదివారం మన్య ప్రగతి ఆధ్వర్యంలో చైర్మన్ గేదెల రవి గ్రామదర్శిని నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. సంస్కృతి - సంప్రదాయాలు, గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తామని చెప్పారు. మానవ సంబంధాలపై 'గ్రామ దర్శిని - ప్రజా చైతన్య అవగాహనా కార్యక్రమం' నిర్వహించారు. సీధి - సామరెల్లిలో యువతతో కలిసి గ్రామాల అభివృద్ధి కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం చర్చించారు. గిరిజన వృద్ధుల పింఛన్లు చాలా వరకు మధ్య కాలంలో ఆగిపోయాయని ఆయనకు చెప్పారు. వాటి పరిష్కారం పై కూటమి ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మన్య ప్రగతి సభ్యులు జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.


గిరిజన యువతతో మాట్లాడుతున్న రవి

మక్కువ -చినభోగిలి రోడ్డుకు మోక్షమెప్పుడో?

- రహదారి అధ్వానంతో నిలిచిపోయిన ఆర్‌టిసి బస్సులు
- విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలకు అవస్థలు

ప్రజాశక్తి - సీతానగరం

మక్కువ-చినభోగిలి రోడ్డుకు మోక్షమెప్పుడానని పలుగ్రామాల ప్రజలతో పాటు సీతానగరం, మక్కువ, పార్వతీపురం, బొబ్బిలి మండలాల ప్రజలు, ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. ఈ రోడ్డు దుస్థితిని చూసి అధికారులను, ప్రజాప్రతినిధులకు ప్రజలు శాపననార్థాలు పెడుతున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో చినబోగిల నుండి మక్కువ వరకు రోడ్డును శాశ్వతంగా వేస్తామని, దీని కోసం ఎన్‌డిబి నిధులు దాదాపు రూ.35 కోట్లు కేటాయించారు. దీంతో ఈ రోడ్డును గత మూడేళ్ల కింద తవ్వివేసేక మధ్యలో పనులు ఆగిపోయేయి. ఇంతవరకు రూ.ఐదు కోట్లు పనులు కూడా పూర్తి కాకపోవడం గమనార్హం. ఈరోడ్డును బివిఎస్‌ఆర్ గుత్తేదారు చేపట్టగా, బిల్లులు రాకపోవడంతో ఆయన చేతులెత్తేసినట్లు అధికారులు తెలియజేస్తున్నారు.

చినభోగిలి నుండి మక్కువ వరకు వెళ్లే రోడ్డును తవ్వివేయడంతో తామరకండి, గెడ్డలుప్పి కూడలి, బగ్గందొరవలస, వెంకటబైరి పురం, కంచేడువలస కూడలి, పాపయ్య వలస, ములక్కాయ వలస, కాశీపట్నం గ్రామాల్లో రోడ్లను కూడా తవ్వి వేయడంతో నిత్యం ఈ ప్రాంతప్రజలు నరకాన్ని అనుభవిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని రోడ్ల పక్కన నివసించే ప్రజలు పడుతున్న వేదన వర్ణనాతీతం. ఈ రోడ్డుపై పార్వతీపురం, సీతానగరం, బొబ్బిలి మండలాల నుంచి ఉద్యోగులు, వ్యాపారులు మక్కువ రాకపోకలు సాగిస్తున్నారు. ఒకరోజు ఈరోడ్డుపై ద్విచక్ర వాహనంపై గానీ, ఆటోపై గాని ప్రయాణిస్తే రెండో రోజు విశ్రాంతి తీసుకోవడంతో పాటు


గోతులమయమైన మక్కువ-చినభోగిలి రోడ్డు

వైద్యానికి కనీసం వెయ్యి రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ప్రయాణికులు విధులకు హాజరు కాలేకపోతున్నామని, అధికారుల చేత తిట్లు కాస్తున్నామని ఉద్యోగులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు , ప్రయాణికులు తమ గోడును ఎన్నిసార్లు పాలకులకు, అధికారులకు చెప్పుకుంటున్నా పరిష్కరించే నాధుడేలేడని వారు వాపోతున్నారు. ఇదే సమయంలో పార్వతీపురం ఆర్టీసీ డిపో బస్సును కూడా నిలిపివేసింది. ఈ రోడ్డుపై ఇప్పటికే ఒక బస్సు విద్యార్థుల కోసం ఉండగా, మరో బస్సు నడిచేసిది. అయితే రోడ్డు పూర్తిగా గోతులమయం కావడంతో ఈ రూట్లో వెళ్లే బస్సు వల్ల ఇంధనం ఎక్కువగా ఖర్చయిపోవడం, మరమ్మతులకు గురికావడంతో ఒక బస్సును నిలిపివేశారు. రోడ్డును మరమ్మతులు చేపడితే తప్ప బస్సును నడిపేది లేదని ఆర్‌టిసి డిఎం స్పష్టం చేశారు. దీంతో పార్వతీపురం, సీతానగరం, బొబ్బిలి మండలాల నుండి మక్కువలో పనిచేసే ఉద్యోగులు ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారు ఎప్పుడు తీస్తే అప్పుడు వెళ్లాలి తప్ప సమయానికి వెళ్లలేకపోతున్నామని, ఆటోలో వెళ్లినా కుదుపులతో తాము పడే బాధలు అంతా ఇంతా కాదని మహిళా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈరోడ్డు దుస్థితిని కలెక్టరు పట్టించుకుని మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ మేరకు సాలూరులో సోమవారం జరగనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిని ఇచ్చేందుకు ఈ ప్రాంత ప్రజా ప్రజతినిధులు సన్నద్ధమవుతున్నారు.


ప్రభుత్వ స్థలంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్

ప్రభుత్వ భూమిలో పక్కా భవనం

ప్రజాశక్తి -కొమరాడ

ప్రభుత్వ భూములు, చెరువులో అక్రమ కట్టడాలను నిషేధిస్తూ ప్రభుత్వం ఒకవైపున చర్యలు తీసుకుంటున్నా మరో వైపున అక్రమారులు యథేచ్ఛగా నిర్మాణాలు కొనసాగిస్తునే ఉన్నారు. ఇందుకు నిదర్శనం కొమరాడ మండల కేంద్రంలో చేపడుతున్న అక్రమ నిర్మాణం.

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపాన గల అంతర్‌రాష్ట్ర రహదారికి ఆనుకుని ఉన్న ప్రదేశంలో తనకు జిరాయితీ భూమిగా ఉందని చెప్పి ఒక ఆసామి ఏకంగా రెండంతస్తుల భవనం కట్టి సుమారు 18 దుకాణాలతో పక్కా భవనం నిర్మించారు. దీంతో స్థానిక సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు ఇది ఆర్‌ఎంబి స్థలమని, పక్కా భవనాలు నిర్మించడం నిషేధమని, గతంలో చెప్పినప్పటికీ అవేమీ పట్టించకుండా అక్కడ అక్రమ నిర్మాణాలు జరిగాయని అన్నారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ సిరికి గంగమ్మ, ఎంపిటిసి సభ్యులు మరడాన అశ్విని తదితరులు అక్కడ నిర్మించిన ప్రైవేటు భవనం పూర్తిగా ప్రభుత్వ స్థలంలోనే కట్టడాలు కట్టారని నిర్ధారించుకొని జిల్లా కలెక్టర్‌కు, స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలో సర్వేనెంబర్ 307/3 మూడ్లో ఆ ఆసామి భూమి ఉన్నప్పటికీ 308, 309 సర్వే నెంబర్లు 13 సెంట్లు ప్రభుత్వ స్థలంలో ఈ భవనం నిర్మాణం జరిగిందని ఫిర్యాదు చేయడంపై రెవెన్యూ అధికారులు దర్యాప్తు నిర్వహించి సర్వే చేశారు. ఈ సర్వేలో 13 సెంట్లు రెండు అంతస్తులు భవనం పూర్తిగా ప్రభుత్వ స్థలంలోనే నిర్మించినట్లు అధికారులు నిర్ధారించారు. ఇప్పటికే ఈ భవనం నిర్మాణానికి సంబంధించిన యజమానికి 7 నోటీసును అందజేసినట్లు సమాచారం. దీంతో అక్రమ నిర్మాణాలు ప్రధాన రహదారిపై దర్జాగా కట్టడంపై స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు మండిపడుతున్నారు. అక్రమ కట్టడాలు కట్టిన భవనాన్ని పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై తహశీల్దార్ వద్ద ప్రస్తావించగా 308, 309 సర్వే నెంబర్లు 13 సెంట్లు ప్రభుత్వ రోడ్డు భవనాల శాఖ చెందిన ప్రదేశంలో భవనం నిర్మించినట్లు తెలిపారు. ఇప్పటికే నోటీసులు అందజేశామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అయితే ప్రభుత్వంలో ఎంత దర్జాగా కబ్జా చేసి ఏకంగా రెండంతస్తుల పక్కా భవనం నిర్మించడంపై మండల కేంద్రంలో తీవ్ర చర్చ జరుగుతుంది. అయితే అక్రమ నిర్మాణాన్ని అధికారులు కూల్చివేస్తారా లేక ఏ విధమైన చర్యలు తీసుకుంటారా అన్న ప్రశ్నలు ప్రజల్లో ఉన్నాయి.

మలుపుల వద్ద జాగ్రత్త : సిఐ

ప్రజాశక్తి - సాలూరురూరల్

రోడ్ల మలుపులు వద్ద జాగ్రత్తగా వాహనాలు నడపాలని పట్టణ సిఐ బి.అప్పల నాయుడు వాహనచోదకులకు సూచించారు. ఆదివారం స్థానిక బైపాస్ రోడ్డులో ప్రధాన మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

పాఠశాలల్లో స్వీపర్లకు భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని స్వీపర్ల యూనియన్ కార్యదర్శి రంగుముద్రి లక్ష్మి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు కోరారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో స్వీపర్లతో సమావేశం జరిగింది. తొలుత సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న రూ.6వేలు జీతాన్ని ప్రతినెలా 5తేదీలోగా చెల్లించాలని, మూడు నెలలుగా ఉన్న బకాయిలను ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వయసు పెరుగుతున్న వర్కర్ల కుటుంబ సభ్యులకు పనిచేందుకు అవకాశం ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్‌ఐ వర్తింపచేయాలని కోరారు. పాఠశాలలో పనిచేస్తున్న వర్కర్లకు కనీస వేతనాల చట్టాన్ని అమలు చేసి జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అబద్ధం, మంగమ్మ, అచ్చియమ్మ తదితరులు పాల్గొన్నారు.


సీతారాం ఏచూరికి నివాళ్లు అర్పిస్తున్న స్వీపర్లు

అధ్వానంగా రహదారులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కాగితాడ, బల్లగుడ్డు, సంధిమానుగూడ, గదబవలస, బట్టిగూడ, కొండవానిగోర తదితర గిరిజన గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉండడం వల్ల గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి చినుకుపడ్డా రహదారులు బురద మయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు మరిన్ని అవస్థలు పడవాల్సి వస్తుందని గిరిజనులు వాపోతున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు చిందర వందరగా తయారవ్వడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నట్లు విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఏ ఒక్కరూ అనారోగ్యానికి గురైనా కనీసం 108 ,104 వాహనాలు వచ్చేందుకు అవకాశం లేకుండా పోతుందని రోగులను మైదాన ప్రాంతానికి తీసుకువెళ్లి అక్కడి నుండి వాహనాల ద్వారా పట్టణాలకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గిరిజన గ్రామాల రహదారుల అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన గిరిజనులు కోరుతున్నారు.

ప్రాణాలు తీసిన అతివేగం

ఎదురెదురుగా బైకులు ఢీకొని ఇద్దరు మృతి

మరో ఇద్దరికి తీవ్రగాయాలు.. ఒకరి పరిస్థితి ఆందోళనకరం


జుజారి


శ్రీను

పజాశక్తి - కురుపాం

అతివేగం అనర్ధమై రెండు నిండు ప్రాణాలు బలికాగా.. ఇరువుర్ని ఆసుపత్రి పాలు చేసిన సంఘటన ఆదివారం కురుపాం మండలంలో చోటు చేసుకుంది. నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠారావు తెలిపిన వివరాల ప్రకారం..

కురుపాం మండలం ఆగంగూడ గ్రామానికి చెందిన బిడ్డిక జుజారి (45) తన భార్య మరియతో కలిసి ద్విచక్ర వాహనంపై దుంబిడిలో చర్చికి వెళ్తున్నాడు. అదే సమయంలో ఆవిరిమానుగూడ గ్రామానికి చెందిన బిడ్డిక శ్రీను (22), తన బంధువైన శ్రీధర్‌తో పాటు ద్విచక్రవాహనంతో తిత్తిరి నుంచి వస్తున్నాడు. ఎదురెదుగా వస్తున్న ఈ రెండు వాహనాలు అతివేగం కారణంగా బల్లేరుగూడ జంక్షన్ వద్ద ఢీ కొట్టుకున్నాయి. ఈ ఘటనలో జుజురి, శ్రీను అక్కడికక్కడే మృతి చెందారు. ఆ వాహనాల్లో వెనుకన కూర్చొన్న జుజారి భార్య మరితో పాటు శ్రీధర్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఈ సమాచారం తెలుసుకున్న నీలకంఠాపురం ఎస్సై నీలకంఠారావు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను మొండెం ఖల్లు పీహెచ్సీకి వైద్యం నిమిత్తం తరలించారు. వారిలో మరియకు తీవ్రంగా గాయాలవ్వడంతో మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం మహారాజా ఆసుపత్రికి రిఫర్ చేశారు. శ్రీధర్‌కు గాయాలవ్వడంతో మొండెంఖల్లు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంకు తరలించారు..


రెల్లివీధిలో అర్థాంతరంగా నిలిచిపోయిన సులబ్ కాంప్లెక్స్

అర్ధాంతరంగా సులభ్ కాంప్లెక్సులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని రెల్లి వీధితో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని పంచముఖ ఆంజనేయ ఆలయ సమీపంలో నిర్మించిన సులబ్ కాంప్లెక్స్ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. 2014లో అప్పటి టిడిపి ప్రభుత్వం హయాంలో సుమారు రూ.20 లక్షల అంచనా వ్యయంతో ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో సులబ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు చేపట్టారు. గుత్తేదారులు అనుకున్న సమయానికి పనులు పూర్తి చేసినప్పటికీ అధికారుల అలసత్వం వల్ల బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో గుత్తేదారులు అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. సులబ్ కాంప్లెక్స్ పనులు పూర్తయితే ప్రజలకు ఎంతో ఉపయోగంగానే ఉంటుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చేసిన పనులకు కూడా పైసా బిల్లు కూడా అవ్వలేదని గుత్తేదారులు ఆరోపిస్తున్నారు. రెల్లి వీధి దగ్గర ఏర్పాటు చేసిన సులబ్ కాంప్లెక్స్ ప్రస్తుతం స్లాబ్‌కే పరిమితమైంది. పంచముఖ ఆంజనేయ ఆలయం సమీపంలో ఉన్న సులభ కాంప్లెక్స్ ప్లాస్టింగులు చేసుకొని తలుపులు బిగించడం, గచ్చు, మోటర్ సదుపాయం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులు పూర్తయితే బహిరంగ మలవిసర్జన కూడా అరికట్టే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇదే విషయమే గత నెల 23న మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన గ్రామసభ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ దృష్టి కూడా తీసుకెళ్లడం జరిగిందని, ప్రజా ప్రతినిధులు స్పందించి తక్షణమే పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్వహణ నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండల విద్యాశాఖ కార్యాలయాల (ఎం ఆర్ సి) నిర్వహణ నిధులను సత్వరమే విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్‌కు లేఖ ద్వారా కోరినట్లు ఎంఇఒ-1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఇఒ కార్యాలయాల నిర్వహణ నిధులు (ఎమ్మార్సీ గ్రాంట్స్) గత రెండేళ్ల నుంచి విడుదల కాలేదన్నారు. దీంతో నిర్వహణ ఖర్చుల భారంతో తమపై పడుతుందన్నారు. శాఖాపరంగా ఎటువంటి నిధులు రానప్పటికీ ఎంఇఒ-1లు అన్ని ప్రభుత్వ విద్యా పథకాల నిర్వహణకు, వివిధ సమావేశాలకు స్వంత డబ్బులు ఖర్చు చేసి ఆయా కార్యక్రమాలు విజయవంతం చేస్తున్నారన్నారు. కావున నిర్వహణ నిధులు తక్షణమే విడుదల చేయాలని కోరారు.

అనాధులైనకు పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

పది రోజుల వ్యవధిలో తల్లిదండ్రులను కోల్పోయి అనాదిగా మారిన ఇద్దరి పిల్లలను అటు ఐటిడిఎ అధికారులు, ఇటు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని బట్టి మొగలివలసకు చెందిన మినీ అంగన్వాడీ కార్యకర్త మృతి పట్ల నివాళులర్పించి ఆదివారం కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రోజుల క్రితం పార్వతి భర్త మెల్లిక సుబ్బారావు హఠాత్తుగా మరణించడంతో ఆమె అనారోగ్యంతో శనివారం మృతి చెందిందన్నారు. దీంతో వీరికి ఉన్న ఇద్దరు పిల్లలైనా మెలిక సంధ్యారాణి, పవన్ కుమార్ అనాధులయ్యారన్నారు. వీరు చదువుకున్న పిల్లలు కావడంతో ఐటిడిఎ అధికారులు స్పందించి జీవనభృతి కల్పించి అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.

పూర్వ విద్యార్థులు కలయిక

పజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (బాలుర) ఆవరణలో ఆదివారం 1992 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు కలిశారు. వీరంతా ఒకరికొకరు ఆప్యాయతగా పలకరించుకొని, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో కె.సింహాచలం, ఎన్.మధు, బి.శ్రీను, పి వెంకటరమణ, డి.నాగరాజు, పి.సురేష్, ఆర్.మాణిక్యరావు, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ :మండలంలోని కొటిపాం జిల్లా పరిషత్ హై స్కూల్ 1995-1996 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం హైస్కూల్లో ఆత్మీయ కలయిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను ఆత్మీయ కలయకకు పిలిచి వారికి ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. స్నేహితులు ఒకరికొకరు ఆప్యాయతగా పలకరించుకుంటూ వారి చిన్ననాటి తీపి గుర్తులను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో తమ గురువులైన ఉపాధ్యాయులకు దగ్గరుండి వడ్డించి వారి సంతోషాన్ని వ్యక్తం చేశారు.

రహదారి గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి - భామిని

మండలంలోని బత్తిలి, బిల్లుమడ, బ్యారేజి, కాట్రాగడ్ వద్ద అలికం - బత్తిలి ప్రధాన రహదారి పై వున్న గుంతలను శని, ఆదివారాలలో బత్తిలి ఎస్ఐ డి.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మట్టి, కంకరతో పూడ్చారు. రోడ్డు పై వున్న గుంతలు పూడ్చటంతో, ఆర్ అండ్ బి అధికారులు పూర్తి స్థాయి మరమ్మత్తులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.


మెయిన్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ప్రసాద్‌బాబు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి : ఎంపిపి

ప్రజాశక్తి - పాచిపెంట

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని మండల టిడిపి అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబు అన్నారు. అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఎన్నో ఏళ్ల నుంచి మరమ్మతులకు గురై పక్కా రోడ్డు నిర్మాణానికి ఎదురుచూస్తున్న మండల కేంద్రంలో గల మెయిన్ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి సుమారు 200 మీటర్లు సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. మెయిన్ రోడ్డు పూర్తిగా మరమ్మతులకు గురి కావడంతో రోడ్డు మీదుగా రాకపోకలకు పాచిపెంట గ్రామస్తులతో పాటు మండల వాసులు అనేక ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురయ్యేవారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన ప్రసాద్‌బాబు యుద్ధ ప్రాతిపదికన చకాచకా రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. రోడ్డు పనులను ప్రసాద్ బాబుతో పాటు కోపరేటివ్ బ్యాంకు మాజీ అధ్యక్షులు దండి మోహన్ రావు, స్కూల్ కమిటీ చైర్మన్ యడ్ల రమేష్, కొత్తల పోలినాయుడు. కె. సూర్యనారాయణ, కిరణ్ దగ్గరుండి చేయిస్తున్నారు.

గిరిజన మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి- పాచిపెంట

మనస్థాపానికి గురై గిరిజన మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పాచిపెంట ఎస్ఐ వెంకట సురేష్ అందించిన వివరాలు ప్రకారం.. పద్మాపురం గ్రామానికి చెందిన కుంభీ రాము, ఒడిశాలోని రాళ్లగెడ్డ గ్రామానికి చెందిన జ్యోతితో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. తన భర్త రాము కుటుంబ బాధ్యతలను పట్టించుకోకుండా తిరిగేవాడు. దీంతో భార్య జ్యోతి భర్తను పలుమార్లు నిలదీసింది. ఈ క్రమంలో శనివారం రాత్రి కూడా ఇరువురి మధ్య గొడవ జరిగింది. రాత్రి ఇంట్లో వేరు వేరు చోట భార్యాభర్తలు నిద్రించారు. రాముకు అర్ధరాత్రి మెలుకువ వచ్చి భార్య గురించి చూడగా వంటగదిలో ఆమె ఉరి వేసుకుంది. ఈ విషయం రాము ఇరుగుపొరుగు వారికి తెలియజేశాడు. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.